సందర్శన్ ఎక్కడ..!

- రూ.5.45 కోట్ల స్వదేశీ దర్శన్ నిధులు వృథా
- పర్యాటకం పేరుతో నిర్మించిన కట్టడాలు గోదావరి పాలు
- అడవిని తలపిస్తున్న ఐలాండ్‌–5 స్థలం



గోదావరిలో కొట్టుకుపోయాక మిగిలిన నిర్మాణ శిథిలాలు

యానాం: ఏదైనా అభివృద్ధి పని చేపడితే సరైన ప్రణాళిక ఉండాలి.. లేకుంటే ప్రజాధనం వృథా కాక తప్పదు.. అచ్చం అలానే ఉంది యానాంలో పరిస్థితి. కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్ణయాలతో గౌతమీ గోదావరి మధ్యలోని ఐలాండ్‌–5 పర్యాటక కేంద్రం శిథిల సాక్ష్యంగా నిలిచింది. నిర్మాణాలు కొట్టుకుపోయి అంతా చిందరవందరగా మారిపోయింది.. ఎవరూ అడుగు పెట్టలేని విధంగా చిట్టడవిని తలపిస్తోంది. ప్రజాధనం దుర్వినియోగానికి నిలువెత్తు సాక్ష్యంగా ఇది నిలుస్తుంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. 2014–15లో కేంద్ర ప్రభుత్వం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టూరిస్ట్ సర్క్యూట్స్ సమగ్రాభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్వదేశీ దర్శన్ పథకాన్ని ప్రారంభించింది. ఆ విధంగా సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ (సీఎఫ్‌ఏ) ద్వారా పర్యాటక స్థలాల్లో మౌళిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో యానాంలోని గౌతమీ గోదావరిలో ఉన్న భౌగోళికంగా సహజ సిద్ధంగా 55.54 ఎకరాల్లో ఏర్పడిన దీవికి ఐలాండ్‌–5 అని పేరు పెట్టింది. దానిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు స్వదేశీ దర్శన్ పథకం ద్వారా రూ.5.45 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ విధంగా 2017లో నిర్మాణాల కోసం టెండర్లు పిలిచింది. 2018 నుంచి నిర్మాణాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఐలాండ్ చుట్టూ రివెట్‌మెంట్, స్తంభాలతో ఫెన్సింగ్, పర్యాటకులు కూర్చునే విధంగా ఎత్తయిన వేదిక, సిమెంట్‌తో హట్‌ల నిర్మాణం, చిన్నపాటి సిమెంట్ దారులు వేసింది.



ముళ్ల పొదల మధ్య సిమెంట్ బెంచీలు



పర్యాటక ప్రాంతంలో గేదెలు ఇలా..

ప్రారంభించిన కొద్ది రోజులకే..

ఐలాండ్‌–5 పర్యాటక ప్రాంతాన్ని ప్రారంభించిన కొద్ది రోజులకే రూ.కోట్లతో చేపట్టిన నిర్మాణాల్లో నాణ్యత లేక గోదావరి వరదలకు కొట్టుకుపోయాయి. చాలారోజుల పాటు వరదనీరు ఉండిపోవడంతో నిర్మాణాలు కూలిపోయాయి. దీంతో అక్కడకు ఎవరూ వెళ్లకపోవడంతో చిట్టడవిలా మారిపోయింది. భారీ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం గేదెలు గడ్డి మేయడానికి రైతులు వదిలేస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు మరిన్ని కట్టడాలు కొట్టుకుపోయాయి. విద్యుత్ అవసరాలకు రూ.లక్షలు వెచ్చించి ప్రత్యేక స్తంభాలతో పాటు సుమారు 20 సోలార్ విద్యుత్ లైట్లను అమర్చారు. అయితే అక్కడ రక్షణ లేకపోవడంతో సోలార్ లైట్లు, ప్లేట్లను దొంగలు ఎత్తుకుపోయారు. కొన్ని స్తంభాలు శిథిలమై నేలకొరిగాయి.

తప్పుడు నివేదికలతో..

> నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. అయితే ఆదేశించి నాలుగేళ్లు అవుతున్నా అధికారుల్లో చలనం లేదు. అవినీతి నిరోధక శాఖ అధికారులు సైతం విచారణ చేయడం లేదు. అయితే కాంట్రాక్టర్లు తప్పుడు నివేదికలతో నిధులు మంజూరు చేయించుకున్నారు.
>
> – సబ్బితి శ్రీనివాస్, సామాజికవేత్త, దరియాలతిప్ప

విచారణ ఎక్కడ?

వరదలకు మునిగిపోతుందని తెలిసి కూడా గోదావరి మధ్యలో నిర్మాణం చేపట్టి ప్రజాధనం దుర్వినియోగం చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌ను, పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీలకు సూచించింది. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనికి తోడు కూనపురెడ్డి సత్యనారాయణమూర్తి వేసిన కేసు ఆధారంగా 2021లో హైకోర్టు సీబీఐ, విశాఖ విభాగాన్ని విచారణకు సైతం ఆదేశించింది. కూలిపోయిన నిర్మాణాలు ఉన్నప్పటికీ పీడబ్ల్యూడీ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై బిల్లులు మాత్రం చేయడం గమనార్హం.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: స్థానిక 33–11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కోరంగి, సీతారామపురం, పీబీవీపాలెం, సీబీవీ పాలెం, గాడిమొగ, చినవలసల, పెదవలసల, లక్ష్మీపతిపురం, భైరవపాలెం, పి.మల్లవరం, జార్జీపేట, నీలపల్లి, పోలేకుర్రు గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల



శ్రీదేవి అమ్మవారి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి అమ్మవారి దసరా ఉత్సవాలకు హాజరు కావాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకు ఆహ్వాన పత్రాన్ని అందించారు. స్థానిక ఎస్పీ కార్యాలయానికి శ్రీదేవి ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం వెళ్లి ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీచే శ్రీదేవి ఉత్సవాల జంబో ఆహ్వాన పత్రికను విడుదల చేయించారు. దసరా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులకు ఎస్పీ సూచించారు. కమిటీ ప్రతినిధులు గంగాబత్తుల బుజ్జి, మామిడిపల్లి రాంబాబు (మాజీ కౌన్సిలర్), నల్లా రాంబాబు, బొబ్బిలి వెంకటేశ్వరరావు, గాలిదేవర సత్తిబాబు, గంగాబత్తుల వెంకన్న పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం

అల్లవరం: స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.లక్ష్మణరావు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి సహచర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. పదోన్నతిపై తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయానికి ఎంపీడీఓగా వెళ్లిన లక్ష్మణరావును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సన్మానించారు. లక్ష్మణరావు, లత దంపతులను ఎంపీపీ శేషగిరిరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది శాలువాలతో సత్కరించారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాయుడు విష్ణు, రాకాపు విజయలక్ష్మి, బర్రె సీతారత్నం, దాకారపు చిరంజీవిరావు, బొమ్మి బాలవేణి, సుందరనీడి సాయి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత



జానకికి రూ.30 వేల చెక్కు అందజేస్తున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి శివారు ఊరపేటకు చెందిన విద్యార్థిని గంటి జానకికి గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే వెంకట రమణారావు రూ. 30 వేల సాయాన్ని సమకూర్చారు. ఇంటర్ బైపీసీ గ్రూపులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైన జానకి ఫిషరీస్ కోర్సు చదువుతోంది. ఈ కోర్సుకు రూ.1.60 లక్షలు అవుతున్న క్రమంలో ఆమెకు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఈ సాయాన్ని అందజేసింది. అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ ప్రతినిధులు జానకికి రూ.30 వేల చెక్కును అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, మణికంఠ, విప్పర్తి రమేష్ తదితరులు ఈ మొత్తాన్ని విద్యార్థినికి అందజేశారు.

అల్పాహారం పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు లూయీ అంధుల పాఠశాల విద్యార్థులకు శనివారం ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు కుడుపూడి త్రినాథ్, గోటేటి గంగాధరరావు, అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో భారీ వర్షం



వర్షపు నీటితో నిండిన పిల్లారాయి వీధి

యానాం: స్థానికంగా శనివారం మధ్యాహ్నం భారీ వర్షానికి తోడు బలమైన ఈదురు గాలులు వీయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పట్టణంలోని పలు ప్రధానమైన రహదారులు ముంపునకు గురవడంతో వాహనచోదకులు, పాదచారులు వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే పిల్లారాయవీధితో పాటు వాటర్‌వర్క్స్ వీధి, జిక్రియానగర్, దోబీవీధి, స్టేట్ బ్యాంక్ వీధి తదితర ప్రాంతాల్లో మోకాలు లోతు నీరు నిలబడిపోయింది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు రహదారిపైకి చేరింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

వాసవీ మాతకు రేపు జలాభిషేకం



వాసవీ మాత దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న పట్టణ వైశ్య సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఏటా దసరా ఉత్సవాలను నిర్వహించడంలో ఓ ప్రత్యేకతను సంతరించుకుంటుంది. వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి కల్యాణ మండపంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వాసవీ మాతకు నిర్వహించే దసరా పూజలను వివరించారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకూ దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలి రోజు అమ్మవారిని వెండి పల్లకీలో ఊరేగించి 108 కలశాలతో ఆర్యవైశ్య మహిళలు జలాభిషేకం చేస్తారు. 25న 102 మంది కన్యలచే కలశ పూజ నిర్వహిస్తారు. 26న అమ్మవారిని రూ. 3 కోట్ల కొత్త కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీ దేవిగా అలంకరిస్తారు. నవరాత్రులూ రోజుకో అవతారంతో దర్శనమిచ్చే అమ్మవారిని పట్టణ, పరిసర గ్రామ ప్రజలు దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను ఆర్యవైశ్య ప్రతినిధులు ఆవిష్కరించారు. వైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, సంఘ ముఖ్య సలహాదారులు వంకాయల కాశీ, యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, నూలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు లోక్ కల్యాణ్ మేళా



వీధి వ్యాపారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మెప్మా పీడీ పెంచలయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అమలాపురం శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పట్టణంలోని వీధి వ్యాపారుల (స్ట్రీట్ వెండర్స్)కు లోక్ కల్యాణ్ మేళా శనివారం జరిగింది. మెప్మా సిటీ మిషన్ కో ఆర్డినేటర్ మంగాదేవి అధ్యక్షతన జరిగిన ఈ మేళాకు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.పెంచలయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్‌లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పీఎం స్వనిధి ద్వారా రుణాలు పొంది జీవన ప్రగతిని పెంచుకోవాలని నిర్మల్‌కుమార్ సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య మాట్లాడుతూ వీధి వ్యాపారులంతా విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకంలో వీధి వ్యాపారులు విధిగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అమలాపురం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.కృష్ణ కిషోర్, మెప్మా టీఎల్‌– ఎల్‌హెచ్ కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ పీఎం స్వనిధి, లోక్ కల్యాణ్ మేళా విధి విధానాలను వివరించారు. అనంతరం పేర్లు నమోదు చేయించుకున్న వీధి వ్యాపారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. వీధి వ్యాపారులకు డాక్టర్ పీఎస్ శర్మ వైద్య పరీక్షలు చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



ముమ్మిడివరంలో ప్రతిజ్ఞ చేస్తున్న నగర పంచాయతీ కార్యాలయ అధికారులు, సిబ్బంది

ముమ్మిడివరం: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. నగర పంచాయతీ పరిధిలో శనివారం స్వచ్ఛ దివస్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్‌ను అక్టోబర్ 2 నుంచి పూర్తిగా నిషేధించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ కె.శ్రీనివాస్, టీపీఓ బి.రాజేష్‌బాబు, నాయకులు కడలి నాగు, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరాహార దీక్షలు



అమలాపురం ధర్నా చౌక్‌లో రిలే దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అమలాపురం రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో అమలాపురం నల్ల వంతెన వద్ద ధర్నా చౌక్‌లో శనివారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ ఆదేశాల మేరకు అన్ని డివిజన్‌లో యూనియన్లు, అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున విద్యుత్ ఉద్యోగులు హాజరై తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక బీమా ఏర్పాటు చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్లను జూనియర్ లైన్‌మెన్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేది లేదని జేఏసీ చైర్మన్ ఎంవీ రమణ, జేఏసీ కన్వీనర్ రాజరత్నం తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లు, కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని, కాంట్రాక్ట్ లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

యానాం: రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (వీఏఓ) ఉద్యోగ రాత పరీక్ష కేంద్రాలను శనివారం ఆర్‌ఏఓ అంకిత్‌కుమార్ పరిశీలించారు. యానాం రీజియన్‌లో 1,900 మంది అభ్యర్థుల కోసం ఏర్పాటైన ఆరు పరీక్ష కేంద్రాలను ఆయన చూశారు. రీజెన్సీ స్కూల్, జూనియర్ కాలేజీ, ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఎస్‌టీపీపీ కళాశాల, ఎంజీజీబీహెచ్, రాజీవ్ గాంధీ ప్రభుత్వ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలను, అక్కడ ఏర్పాట్లను తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కామనగరువు వద్ద సర్వే చేస్తున్న తహసీల్దార్ అశోక్ ప్రసాద్

అమలాపురం రూరల్: అమలాపురం భట్నవిల్లి – పేరూరు వై.జంక్షన్ వరకూ విస్తరించిన బైపాస్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా విత్తనాలవారి కాలువ గట్టు నుంచి చిందాడగరువు క్రాస్ చేసే బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. రద్దీ సమయంలో తాలూకా ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులతో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్నారు. అయితే రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారానికి అడుగులు వేశారు. అమలాపురం తహసీల్దార్ అశోక్ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం కామనగరువు ఆమని ఆటోమొబైల్స్ ప్రాంతంలో ఇరువైపులా 100 అడుగుల భూసేకరణ కోసం సర్వే చేపట్టారు. గ్రామాల నుంచి హైవేపై వెళ్లే వాహనాలు కొంత దూరం పక్కదారి వెంట వెళ్లి రోడ్డు ఎక్కుతాయి. ఈ విధంగా చేస్తే ప్రమాదాలకు చెక్ పెట్టినట్లు అవుతుందని అధికారులు భావిస్తున్నారు. రోళ్లపాలెం వద్ద ఈ విధంగా ఇబ్బందులు ఉన్న ప్రదేశాలు గుర్తించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వివరించారు.


సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

తాళ్లరేవు: సమాజంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. వరల్డ్ ఫోరెన్సిక్ సైన్స్ డే సందర్భంగా జిల్లా ఎస్పీ బింధుమాధవ్ ఆదేశాల మేరకు శనివారం పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో ఫోరెన్సిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పనిచేస్తున్నారని, తదనుగుణంగా ప్రజలు సహకరించాలని కోరారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పైడా కళాశాల కరస్పాండెంట్ పైడా సత్య శ్రీరామ్, డీన్ ఎం.వీరభద్రరావు, ప్రిన్సిపాల్ పీవీ సూర్యప్రకాష్, ప్రొఫెసర్ రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ వర్షిణీ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే ఫ్లెక్సీలు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్సైలు

అమలాపురం టౌన్: దసరా సందర్భంగా ఫ్లెక్సీల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అవమానపరిచే గుర్తులు, చిత్రాలను ప్రింట్ చేసినా ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులతో పాటు వాటికి ఆర్డర్ ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫ్లెక్సీల ప్రింటింగ్ నిర్వాహకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. దసరా, రాజకీయ, సినీ హీరోల పుట్టినరోజు వేడుకలు, సినిమాల రిలీజ్ సందర్భాల్లో ఫ్లెక్సీలను ఇతరులకు అభ్యంతరకరంగా, అవమానకరంగా ఉండేలా ముద్రించ వద్దని సూచించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్సైలు ఎన్ఆర్ కిషోర్‌బాబు, మనోహర్ జోషిలు కూడా సమావేశంలో మాట్లాడుతూ ఫ్లెక్సీల ప్రింటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

శాస్త్రీయ కోణం పెంపొందించుకోవాలి



అనాతవరం పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం తదితరులు

ముమ్మిడివరం: సైన్స్ ల్యాబ్‌లను పాఠ్యాంశాలకు అనుసంధానంగా వినియోగిస్తే విద్యార్థులలో శాస్త్రీయ కోణం పెంపొందించవచ్చని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణం, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిల్లి రాంబాబు అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం అనాతవరం, కొమానపల్లి ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సబ్జెక్టుతో సంబంధం లేకుండా ప్రతి ఉపాధ్యాయుడు ల్యాబ్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఏఓ కాశీ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆర్‌ఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు అమలాపురం కలెక్టరేట్‌లో ఏఓ కె.కాశీ విశ్వేశ్వరరావుకు శనివారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో చాలా మంది విద్యార్థులకు చదువు పూర్తయినా సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అదేవిధంగా ఇంజినీరింగ్ విద్యార్థులు కొన్ని సెమిస్టర్లు రాయలేని పరిస్థితి ఉందన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న రూ. 4,200 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్పీని కలసిన డీటీఓ



ఎస్పీ రాహుల్ మీనాకు పూల మొక్క అందిస్తున్న డీటీఓ శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను జిల్లా రవాణా శాఖాధికారి (డీటీఓ) దేవిశెట్టి శ్రీనివాసరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి డీటీఓ వెళ్లి ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న రోడ్డు భద్రతా కార్యక్రమాల గురించి ఎస్పీకి టీడీఓ చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్లు లేకుండా బైక్‌లు నడపడంపై, పట్టుబడిన కాలేజీ విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ తదితర అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు సూచనలు చేశారు.

మాజీ ఎంపీ అనురాధ పరామర్శ

అల్లవరం: పితృ వియోగంతో బాధపడుతున్న పాత్రికేయుడు గుర్రం గంగాధరరావును మాజీ ఎంపీ చింతా అనురాధ కొమరగిరిపట్నంలోని ఆయన నివాసంలో శనివారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు జున్నూరి రామారావు, గుర్రం బాబులు, బసవా అనీల్ పాల్గొన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడి కోడూరుపాడులోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జిల్లి శ్రీనును అనురాధ, జెడ్పీటీసీ కొనుకు గౌతమి పరామర్శించారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా ర్యాలీ



ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అంకిత్‌కుమార్ తదితరులు

యానాం: సైకిల్ తొక్కడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియచేయడానికి ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నట్లు ఐఏఎస్ అధికారి, ఆర్‌ఏఓ అంకిత్‌కుమార్ తెలిపారు. శనివారం డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియం వద్ద స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆధ్వర్యంలో సండేస్ ఆన్ సైకిల్ ఫిట్ ఇండియా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సైతం ఉపకరిస్తుందన్నారు. ఆదివారాల్లోనే కాకుండా ప్రతి రోజూ సైకిల్ తొక్కాలని కోరారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, శాయ్ అకాడమీ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటారు

అమలాపురం రూరల్: స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బండారులంక పంచాయతీ వద్ద శనివారం సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచ్‌తో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి, పంచాయతీ సెక్రటరీ కె.శ్రీనివాస్‌లు పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి



గొల్లవిల్లిలో ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ఉప్పలగుప్తం: ప్రజలకు ఉద్యోగులు అందిస్తున్న సేవలు మరువలేవని గొల్లవిల్లి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. స్థానిక సచివాలయంలో ఆయా శాఖల్లో ఉద్యోగులుగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పి.సాయి, రవిచంద్ర, ఆనంద్, శ్రావణ్ వర్మ, వీరన్నబాబు, నవీన్, ఆకాశ్, దివ్యలను స్థానిక సచివాలయంలో శనివారం ప్రజలు, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మంచెం బాలకృష్ణ, నల్లా సత్యనారాయణ, మారిశెట్టి పుండరీకాక్షుడు, జొన్నాడ చిన్ని, బడుగు గణేష్, సుంకర బుజ్జి, చప్పిడి దుర్గారావు, అరిగెల నానాజీ, చప్పిడి శ్రీను, గొలకోటి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తించిన కొండచిలువ



గోవలంక ఏటిగట్టు రహదారిపై భారీ కొండచిలువ

తాళ్లరేవు: మండలంలోని గౌతమి గోదావరి ఏటిగట్టుపై గోవలంక వద్ద శుక్రవారం రాత్రి భారీ కొండచిలువ కనిపించింది. ఏటిగట్టు రహదారిని దాటుతుండగా పలువురు చూసి హడలెత్తిపోయారు. ఇలా ఉండగా పెద్ద కర్రతో ఒక వ్యక్తి ఆ పామును కొట్టేందుకు ప్రయత్నించగా తప్పించుకుని వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇది సుమారు పది అడుగులకు పైగా ఉంటుందని అంటున్నారు.